W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
31-12-2025





## కటౌట్లు చూసి టికెట్లు ఇవ్వం

### గెలిచే 'గుర్రాల'కే బి-ఫామ్ : మంత్రి పొంగులేటి

రాబోయే మున్సిపల్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో జరిగింది.

09



# వైభవంగా ఏకాదశి

## రామనామస్మరణతో మార్మోగిన భద్రాద్రి

### వైకుంఠ రాముడిగా అనుగ్రహించిన భద్రాద్రి రామయ్య

### ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం..

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపే తంగా భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు.

వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు.

03

### ఏకాదశి ఉత్సవాలు విజయవంతం

సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవం తమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి భక్తులకు పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

భద్రాద్రి బ్యూరో, మహా



## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హెచ్చరించారు.



09

## వైభవంగా పర్ణశాల వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం

### రామస్మరణలతో మార్మోగిన ఆలయం


ప్రముఖ పుణ్య క్షేత్రం పర్ణశాల శ్రీ సీతారా మ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



04

## పెనుబల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సస్పెండ్

పెనుబల్లి మండలం తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్ పై సస్పెన్షన్ వేటు పడింది. పెనుబల్లి మండలం చింతగూడెం రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 71/3,73/4 లోని సీలింగ్ భూమి 3.20 కుంటల్లో 1.20. కుంటల సుమారు 5 కోట్లు విలువగల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా డిజిటల్ సైన్ పూర్తి చేయగా దీనిపై కల్లూరు సబ్ కలెక్టర్‌కు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు.



04

# క్రీడా మైదానాన్ని యువత ఉపయోగించుకోవాలి

## ఎస్పీ రోహిత్ రాజు



**మహా,దుమ్ముగూడెం:** యువత తమ బాధ్యతగా క్రీడామైదానాన్ని ఉపయోగించుకోవాలని, క్రీడ పరికరాలను జాగ్రత్తగా వాడుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనకాల గల ప్రదేశంలో 2.20 కోట్ల రూపాయల వ్యయంతో ఐటీడీఏ,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న క్రీడా మైదానాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలోని షటిల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, జిమ్ము సంబంధించిన మెటీరియల్స్ను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఏజెన్సీలోనీ క్రీడాకారులకు స్టేడియాన్ని త్వరగా సిద్ధం చేసి ప్రారంభించాలని, క్రీడాకారులు అధిక సంఖ్యలో క్రీడా మైదానాన్ని ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇండోర్ స్టేడియం బాధ్యత యువత చొరవ తీసుకొని స్టేడియంలో మెయింటినెన్స్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఐటిడిఏ ఈఈ హరీష్ పి ఈ టి వెంకటేష్ దుమ్ముగూడెం యూత్ సభ్యులు హరికృష్ణ క్రాంతి ఉప సర్పంచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మిస్ టీన్ ఇండియా ప్రీతిని సన్మానించిన భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ

**బూర్గంపాడు(భద్రాచలం),మహా:** రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ లో జరిగిన ఫరెవర్ స్టార్ ఇండియా సీజన్ ఫైవ్ లో మిస్ టీన్ ఇండియా 2025 తెలంగాణ రాష్ట్రం నుండి విజేతగా నిలిచిన భద్రాచల బిడ్డ ప్రీతి యాదవ్ ను భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రీతి యాదవ్ ను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మిస్ ఇండియా కిరీటం సాధించాలని, భద్రాచల ఖ్యాతిని అంబరాన్ని అంటే విధంగా చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ ,కోటగిరి ప్రబోధ్ కుమార్ దానేశ్వరరావు, రేపాక పూర్ణచంద్రరావు, అకోజు సునీల్ , అయినవోలు రామకృష్ణ ,అజీమ్, కావూరి గోపి, మోహన్ రావు, కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, తెల్లం రాణి తదితరులు పాల్గొన్నారు.



# సన్మాన మహెూత్సవ ఆహ్వానం

## మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి



**మహా:** పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల నూతన సర్పంచులకు సన్మాన మహెూత్సవ కార్యక్రమం

**కార్యక్రమ వివరాలు**

**డిసెంబర్ 31 సమయం: ఉదయం 11:00 గంటలకులి**
**వేదిక: ఎస్.ఆర్. గార్డెన్స్, ఖమ్మం - వైరా రోడ్.**
**ఆయా గ్రామాల సర్పంచ్ లు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.**

నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ... పాలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మన ప్రియతమ నాయకులు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం , సమాచార శాఖామాత్యులు ? పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా, నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు మిత్రపక్షాల సర్పంచులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

# పర్ణశాల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న ఎస్పీ రోహిత్

**మహా దుమ్ముగూడెం:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం అనుబంధం ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఎస్పీకి సాదరంగా ఆహ్వానం పలికి గర్భగుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఎస్పీ ఆలయ ప్రాంగణంలోని కుటీరం, శివాలయం, నార చీరలు ప్రాంతాన్ని సందర్శించి వాటి యొక్క విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య సిఐ రాజగోపాల్ ఎస్సై రాజశేఖర్ ఐటిడిఏ ఈ ఈ హరీష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆలయ పనులతో అభివృద్ధికి శ్రీకారం

## టేకుల చెరువు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ



**బూర్గంపహాడ్ మహా:** రామాలయ పనులతో టేకుల చెరువు గ్రామ పంచాయతీలో అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు టేకుల చెరువు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ అన్నా రు. మంగళవారం గ్రామంలోని రామాల య ప్రహరీ గోడ పనులను సర్పంచ్ బోళ్ళ సైదమ్మ, ఉప సర్పంచ్ ఇస్లావత్ రవి లు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భం గా సర్పంచ్ సైదమ్మ మాట్లాడుతూ పంచాయ తీ పరిధిలోని కాలనీలలో దశలవారీగా అభివృ ద్ధి పనులు చేపడతామని ఆమె అన్నారు. తమ కు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చు కునేందుకు గ్రామంలోని అభివృద్ధి పనులు చేప డతామని ఆమె అన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీలకతీతంగా, రాజకీయాలకతీ తంగా గ్రామ అభివృద్ధే ధ్యేయంగా తమ పాలక మండలి పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు. గ్రామంలోని ఎనిమిది వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్య మని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇస్లావత్ రవి, వార్డు సభ్యులు బోళ్ళ శ్రీశైలం, కాకా రాఘవమ్మ, లావూడియా వీరన్న, తేజా వత్ కుష్రీయా, గ్రామ పెద్దలు పాండవుల రామానాథం, బుర్ర వెంకన్న,రాము, ఉపేందర్, జక్కుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
31-12-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# భద్రాద్రిలో వైభవంగా ఏకాదశి వేడుకలు

## ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం..

## వైకుంఠ రాముడిగా అనుగ్రహించిన భద్రాద్రి రామయ్య





**భద్రాద్రి బ్యూరో, మహా:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష ఆరాధనలు, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతక పఠనం నిర్వహించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తరామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ మూలవిరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకకు భద్రాచలం, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ పిఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ దొర తదితర ప్రజాప్రతినిధులు అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

### ఏకాదశి ఉత్సవాలు విజయవంతం

సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి భక్తులకు పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.









## ముక్కోటి ఏకాదశి సందర్భంగా అశ్వారావుపేటలో భక్తుల సందడి

**అశ్వారావుపేట, మహా:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా అశ్వారావుపేట పట్టణం భక్తి వాతావరణంలో మునిగిపోయింది. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. నామస్మరణ చేస్తూ క్యూల్లో నిలబడి పూజలు చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న కోదండరామాలయంలో వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు జరగగా మంత్రోచ్ఛరణలు మార్మోగాయి. స్వామివారిని పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. భజన బృందాలు కీర్తనలు చేస్తూ ఊరంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేశారు. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం భక్తులు ప్రార్థనలు చేశారు.





FOLLOW: @ANNTELUGU
31-12-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



## ముక్కోటి ఉత్సవాల్లో కొత్వాల

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) పర్వదినం సందర్భంగా పాల్వంచలో పలు దేవాలయాల్లో మంగళవారం జరిగిన ఉత్తరద్వార దర్శనం పూజల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని పూజలు చేశారు. తెల్లవారుజామున పాత పాల్వంచలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన పల్లకి సేవలో ఆంజనేయస్వామి దేవాలయంలో, పాల్వంచ బొల్లోరిగూడెంలోని రామాలయంలో జరిగిన అభిషేకాలు ద్వారదర్శనం ప్రత్యేక పూజలలో కొత్వాల పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పూజారి కందాల సింహాద్రి ఆనందకుమారాచార్యులు, కిలారి సుజాత, ఎస్ వి.రామానుజాచార్యులు, సముద్రాల శ్రీనివాస్, కేశబోయిన కోటేశ్వరరావు, వెంకటనారాయణ, బాడిశ శంకర్ రావు, వెంకటేశ్వర్లు, లింగా రమేష్, హర్ష, పరమేశ్వరి వేణు, కొప్పరపు రాము తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు





**నేలకొండపల్లి, మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం వైకుంఠ ఏకాదశి "వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం ను దర్శించుకున్నారు. మండల కేంద్రంలో రామదాసు మందిరంలో ఉత్సవం ను ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి ' దేవాలయాలలు భక్తులతో కిటకిటలాడారు. మండలం లోని మంగాపురతండా లో జరిగిన ఏకాదశి వేడుకలలో సర్పంచ్ దిరావత్ అశోకా రాణి దంపతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్య సోసైటీ ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, ఉప సర్పంచ్ నాగరాజు, సోసైటీ మాజీ అధ్యక్షుడు ధీరావత్ బాలాజీ, గోబ్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం దేవాలయంలో జరిగిన వేడుకలలో సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, బొనగిరి కిరణ్ పాల్గొన్నారు.

## పెనుబల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సస్పెండ్

**పెనుబల్లి, మహా:** పెనుబల్లి మండలం తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్ పై సస్పెన్షన్ వేటు పడింది. పెనుబల్లి మండలం చింతగూడెం రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 71/3,73/4 లోని సీలింగ్ భూమి 3.20 కుంటల్లో 1.20. కుంటల సుమారు 5 కోట్లు విలువగల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా డిజిటల్ సైన్ పూర్తి చేయగా దీనిపై కల్లూరు సబ్ కలెక్టర్‌కు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు ఈ వ్యవహారంలో పెనుబల్లి తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, జి పి ఓ రవి ప్రైవేట్ వ్యక్తుల నుంచి భారీ స్థాయి లో ముడుపులు సేకరించారని ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెటి మంగళవారం పెనుబల్లి మండలం తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్ ను చింతగూడెం గ్రామపంచాయతీ ఆఫీసర్ జి పి ఓ రవి ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# వైభవంగా పర్ణశాల వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం

### వేలాదిగా తరలివచ్చిన భక్తులు రామస్మరణలతో మార్మోగిన ఆలయం..







**మహా, దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్య క్షేత్రం పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అధ్యయనఉత్సవాల్లో భాగంగా మంగళవారం పర్ణశాల శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉత్తర ద్వారం తెరచి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి సుప్రభాతం ఆరాధన 2 గంటలకు మూలమూర్తులకు పంచామృతులతో అభిషేకం నిర్వహించి రెవెన్యూ డిపార్ట్మెంట్ తహసిల్దార్ దంపతులు అందించిన పట్టు వస్త్రాలను అలంకరణ మూలమూర్తులకు ఉత్సవంగా అభిషేకం అయిన తర్వాత లఘు ఆరాధన జరిగి మళ్ళీ విశేషంగా తిరుమంజనం నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని నమ్మే వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఉత్తర ద్వార దర్శనాల్లో స్వామివారిని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు రామస్మరణలతో ఆలయ ప్రాంగణం మొత్తం మార్మోగింది.సరిగ్గా తెల్లవారుజామున 5 గంటలకు మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా వేదఘోష సాగుతుండగా ఘణ గంటల ధ్వనుల మధ్య ఉత్తర ద్వారం నెమ్మదిగా తెరుచుకుంది. ఈ అద్భుతమైన దృశ్యాన్ని తిలకించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తిలకించి పోయారు.ఉత్తర ద్వార దర్శన అనంతరం స్వామివారిని తిరివిధిగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ద్వార దర్శనానికి విచ్చేసినటువంటి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్ కుమార్ చార్యులు, భార్గవచార్యులు, వెంకటాచార్యులు, దుమ్ముగూడెం తాసిల్దార్ అశోక్ కుమార్, డిటి భరణి బాబు ,ఎంపీడీవో వివేక్ రామ్,సిఐ వెంకటప్పయ్య, ఎస్సై రాజశేఖర్, ఆలయ ఇంచార్జ్ వాసు, ఇరిగేషన్ అధికారులు రాజు సుహాస్ ,భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ సీతమ్మ,సర్పంచ్ వాగే ఖాదర్ బాబు, ఉపసర్పంచ్ శ్రీధర్ ,పంచాయతీ అధికారి వీరారెడ్డి, విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి ,మోహన్ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సీఐ రాజును మర్యాద పూర్వకంగా కలిసిన

# సర్పంచ్ కొత్త యాకయ్య

**దంతాలపల్లి, మహా:** మండల కేంద్రం దంతాలపల్లి పోలీసు స్టేషన్ లో సీఐ పీ. రాజును ఆగపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కొత్త యాకయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ రాజును ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొత్త యాకన్న మాట్లాడుతూ... అగపేట గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆగపేట మాజీ ఎంపీటీసీ యర్రం వెంకటరాములు , మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి మురళి , కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండగాని వెంకన్న , శెగ్గెం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# నయనానందకరం వైకుంఠ ద్వార దర్శనం

## ఉత్తర ద్వారా దర్శనంతో ఉప్పొంగిన భక్తి పారవశ్యం

## భక్తులతో కిటకిటలాడిన దైవ క్షేత్రం

## శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం











**జూలూరుపాడు, మహా:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు పురాణం శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మంగళవారం తెల్లవారుజామున జరిగిన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం భక్తులకు నైనానందకరం కలిగించింది. ఉత్తరద్వార దర్శనంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యముతో ఉప్పొంగిపోయారు. మండల వ్యాప్తంగా ఉన్న దేవాలయ నిర్మాణాలకు భిన్నంగా, నర్సాపురం గ్రామంలోని రామాలయం ఉత్తర ముఖంగా ద్వారాన్ని కలిగి ఒక ప్రత్యేకతను సంతరించుకోవడం వలన ప్రతి ఏట గ్రామంలోని భక్తులతోపాటు, పరిసర ప్రాంత భక్తులతో దైవ క్షేత్రం కిటికీటలాడింది. కార్యక్రమం ఆధ్యాంతం భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మ్రగిపోయింది. అనంతరం గ్రామ పెద్దలు చెరుకుమళ్ళ రుక్కయ్య దంపతుల సౌజన్యంతో ఆలయ చైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి, పాలకమండలి సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



# సిపిఐ బహిరంగ సభ జయప్రదం చేయండి

### సిపిఐ నాయకులు ముప్పా వెంకటేశ్వరరావు (లడ్డా),పుల్లారెడ్డి

**బూర్గంపహాడ్ మహా:** సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు (లడ్డ ),పినపాక నియోజకవర్గం పార్టీ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి లు పిలుపునిచ్చారు. సారపాక పార్టీ కార్యాలయంలో మండల కార్యవర్గం సమావేశం మంగళవారం పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 దేశాల ప్రతినిధులు హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని జనవరి మూడో తేదీ సాయంత్రం 4 గంటలకు సారపాక ప్రధాన కూడలి లో ప్రచార జీప్ జాత చేరుకుంటుందని మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సబ్కాం నాగేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం ,మండల సీనియర్ నాయకులు సిద్ధార్థ సుబ్బారెడ్డి, ఎండి సాజిద్, బర్ల వెంకటేశ్వర్లు, బుర్ర రాఘవులు, గాదె శ్రీను, దాసరి మల్సూర్ ,వంకాయలపాటి నాగేశ్వరావు ,మేకల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

### మూడో సారి ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా భీమవరపు శ్రీనివాసరావు





**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఉసిరికా యలపల్లి కోట మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో సీనియర్ జర్నలిస్ట్ దమ్మాలపాటి కృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా భీమవరపు శ్రీనివాసరావు ను,కోశాధికారిగా పాలిక శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ప్రధాన కార్యదర్శిగా బానోతు బాలు నాయక్, ఉపాధ్యక్షులుగా ధరావత్ కళ్యాణ్, సహాయ కార్యదర్శిగా కేతిమల్ల సురేష్, గౌరవ అధ్యక్షుడిగా తేల్ల శ్రీనివాసరావు లను సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ప్రెస్ క్లబ్ గా ఎన్నికైన వారిని తోటి జర్నలిస్టులు అనంతారపు వెంకటాచారి,పగడాల నాగేశ్వరరావు,కొండపల్లి వెంకటేశ్వరరావు,ముక్క వెంకటేశ్వర్లు,కొత్తూరు శ్రీనివాసరావు,ఏపూరి లక్ష్మీనారాయణ,బాధవత్ రాము నాయక్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ చైర్మన్ భీమవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పాలకుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలవాలని సూచించారు.



## జనవరి 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో

# కేటీఆర్ పర్యటన

### రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**ఖమ్మం,మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జనవరి 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించానున్నారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లకు జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా కొత్తగూడెం చేరుకుంటారు. ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. రెండు జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, ఓడిపోయిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.





# పినపాక రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం

### కన్నుల పండుగగా సాగిన ఏకాదశి పర్వదినం

**పినపాక ,మహా:** మండల కేంద్రంలో రామాలయం నందు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారంఘనంగా నిర్వహించడం జరిగింది.ఉదయం 5గంటల కు సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఉత్తర ద్వార దర్శనం చేశారు.తొలుత పినపాక గ్రామంలోని మహిళలు ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో సుందరంగా తీర్చిదిద్దారు. పరిసర గ్రామాల ప్రజలు వైకుంఠ ఏకాదశి పర్వదినాన పినపాక మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, శ్రీరామనామ జపంతో తెల్లవారుజాము నుంచే దర్శనం చేసుకోగా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లను చేశారు . ఈ సందర్భంగా రామాలయం వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్ర ప్రగడ రామమూర్తి , ఆలయ పురోహితులు పత్రి వినోద్ కుమార్ లు ఉత్తర ద్వార దర్శనం పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు .ఈ సందర్భంగాఎర్ర ప్రగడ రామమూర్తి ఉత్తర ద్వార దర్శనం విశిష్టతను భక్తులకు వివరించారు. హిందూ సాంప్రదాయాల్లో పవిత్రమైన రోజుల్లో వైకుంఠ ఏకాదశి ఒకటి అని, దీనిని ముక్కోటి ఏకాదశి అంటారని, ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం అని అన్నారు. డిసెంబర్ 30వ తేదీన జరుపుకునే ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేకత ఉందని, ఈరోజు శ్రీమహావిష్ణువుకి ఎంతో ప్రీతికరమైనదని,



మోక్షమార్గాన్ని మానవజన్మకు చూపించే అద్భుతమైన పవిత్ర దినంగా ప్రతి ఒక్క హిందువు భావిస్తాడని తెలిపారు. ఉత్తర ద్వార దర్శన కార్యక్రమానికి హాజరైన భక్తుల కనుగుణంగా ఏర్పాట్లను చేసిన ఆలయ కమిటీని ప్రజలు అభినందించారు.

## ముక్కోటి సందర్భంగా అత్తి పట్ల కుటుంబ సభ్యులు స్వామివారికి వెండి వస్తువుల బహూకరణ



**బూర్గంపహాడ్ మహా:** ముక్కోటి సందర్భంగా నాగినేని ప్రోలు, రెడ్డిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి అత్తిపట్ల పుల్లయ్య విజయ దంపతులు గార్ల కుమారులు వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు,అత్తిపట్ల శ్రీను, ప్రవీణ, దంపతులు వారి కుమారుడు శ్రీకాంత్ లు స్వామి వారికి వెండి వస్తువులు బహుకరించారు. సుమారు లక్ష 80 వేల రూపాయల విలువగల స్వామి వారికి వక్షస్థల, పాదుకలు, కర్ణ పత్రాలు వెండి వస్తువులు ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళీకృష్ణమాచార్యులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొండెద్దుల వెంకటేశ్వర రెడ్డి ,దౌపాటికృష్ణమూర్తి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, మెట్టు నాగి రెడ్డి,బానోత్ రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ తిప్పలను పరిష్కారం చేయాలి



**మహా(ఖమ్మం):** రైతులకు యూరియా కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం యాప్ బుకింగ్ లో ఉన్న ఇబ్బందులు తొలిగించడం తోపాటు పాత పద్ధతి లో సోసైటిలు, డీలర్లు వద్ద నుంచి రైతులు నేరుగా యూరియా కొనుగోలు చేసే అవకాశం కూడా కల్పించాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ లో నమోదు చేసుకున్న రైతులకు ఎకరాకు అవసరమైన యూరియా ఒకేసారి అందించి మూడు లోపు ఎకరాల ఉంటే రెండు విడతల్లో, మూడు నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగు ఉంటే మూడు విడతల్లో ఐదు ఎకరాల పైన ఉన్న రైతులకు నాలుగు విడతల్లో యూరియా సరఫరా చేయడం వల్ల పంటల దిగుబడి పైన తీవ్ర ప్రభావం చూపుతోంది అని అన్నారు.



# శబరిమలై సైకిల్ యాత్ర పూర్తి చేసిన గురు స్వామికి సన్మానం



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన మొండ్రు క్రాంతి కుమార్(గురు స్వామి) 41 రోజుల అయ్యప్ప దీక్షలో భాగంగా ఈనెల 15న సత్తుపల్లి ప్రాంతం నుండి శబరిమలై పుణ్యక్షేత్రానికి సైకిల్ యాత్రగా బయలుదేరి, 15 రోజులు ప్రయాణం చేసి పులిమేడు కొండమీదుగా శబరిమలై చేరుకొని అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గురు స్వామి క్రాంతి కుమార్, స్వప్న దంపతులను కిష్టారం శ్రీ కోదండ రామాలయం కమిటీ పెద్దలు పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు, నరుకుళ్ళ శేషగిరి రావు, మాచినేని నరేంద్ర, మాజీ సర్పంచ్ ములకలపాటి విష్ణువర్ధన్ రావు, సీనియర్ నాయకులు కోడిమెల్ల అప్పారావు, కొలపనేని భవాని తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందనవసరం లేదు

**నేలకొండపల్లి, డిసెంబర్ 30 మహా:** యూరియా కోసం రైతులు ఆందోళన చెందనవసరం లేదని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ అన్నారు. మండలం లోని వివిధ సొసైటీలలో మంగళవారం పంపిణీ చేసిన యూరియా ను పరిశీలించారు. మండల కేంద్రంలో గ్రోమోర్ వద్ద రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉన్న వారికి పంపిణీ చేయాలని నిర్వహాకులను ఆదేశించారు. ఆమె స్వయంగా రైతుల వద్ద నుంచి జీరాక్స్ లను సేకరించి వీరందరికి ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలం మంగళవారం 9 కేంద్రాలలో 2,600 యూరియా కట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలం లోని రైతాంగం కు యూరియా కోరత లేకుండా ఉండేందుకు మరో 250 మెట్రిక్ టన్నుల యూరియా కోసంఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా వరస క్రమంలో తీసుకోవాలని సూచించారు. యాఫ్ సాంకేతిక వలన నిలిచిపోవటంతో రైతులకు ఇబ్బందులు లేకుండా పాత పద్ధతి లో పంపిణీ చేసే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం నేలకొండపల్లి సొసైటీలో 400 యూరియా బస్తాలు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. పంపిణీ వలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారులు తదితరులు పాల్గొన్నారు.





# సిపిఐ ఉద్యమ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జనవరి 18న సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సావాలు
- ప్రతి కమ్యూనిస్టు కుటుంబం వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలి
- 3 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సిపిఐ వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జరిగిన సిపిఐ పట్టణ విస్తృత జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర కార్మిక కర్షక పేద ప్రజల పోరాటాలతో ముడిపడి ఉందన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ప్రతి కమ్యూనిస్టు కుటుంబం ఈ చారిత్రక ఉత్సవాల్లో తప్పకుండా పాల్గొనాలన్నారు. వందేళ్ల ఉత్సవాల ప్రచారంలో భాగంగా ఈ నెల 3 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతా ద్వారా సిపిఐ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు భావజాలం మరింత అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉత్సావాల ప్రచారంలో భాగంగా జనవరి 3 నుంచి 7 వరకు జిల్లా వ్యాపితంగా ప్రచార జత కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్ కె ఫహీమ్, పట్టణ నాయకులు నేరెళ్ల రమేష్, గొనె మణి, విజయలక్ష్మి, వంగ వెంకట్, గడ్డం రాజయ్య, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గోపి కృష్ణ, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, గుత్తుల శ్రీనివాస్, పి.సత్యనారాయణాచారి, తూముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ గెలిచే మొక్కులు చెల్లింపులు

**నేలకొండపల్లి, మహా:** సర్పంచ్ గెలిస్తే...మొక్కులు చెల్లించుకుంటామని స్థానిక కాంగ్రెస్ నాయకులు మొక్కుకున్నారు. విజయం సాధించటంతో మంగళవారం ఆ మొక్కులు చెల్లించుకున్నారు. మండలం లోని కోరట్లగూడెం లో కాంగ్రెస్ అభ్యర్ధి కొత్తపల్లి త్రివేణి సర్పంచ్ గా గెలిపిస్తే తాము 101 కొబ్బరికాయలు కొడతామని స్థానిక నాయకులు బచ్చలకూరి నాగరాజు స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం లో మొక్కుకున్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు అనుకున్నట్లుగా మొక్కులు చెల్లించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, కొత్తపల్లి. సబ్బయ్య, బాజా శ్రీనివాసరావు, షేక్ మైబు, సైదా, నజీర్, లాలు, 'నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో సర్పంచ్, ఉపసర్పంచ్ లకు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ మహా:** రవీంద్ర భారతి లో బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఉపసర్పంచ్ లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా ఉప సర్పంచ్ సంఘం అధ్యక్షులు మహంకాళి రామారావును ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామస్థాయి ప్రజాప్రతినిధులే పాలనకు పునాదులని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ ఉపసర్పంచ్ ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న ఉప సర్పంచ్ లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మహంకాళి రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు ముదిరాజ్ సంఘ నాయకులు సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

**నేలకొండపల్లి, మహా:** పోలీసు శాఖ తరుపున ప్రజలందరికీ ముందస్తు నూతన సంవత్సర హార్దిక శుభాకాంక్షలు. నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగే విధంగా ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని నేలకొండపల్లి ఎస్సై పి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యూ ఇయర్ సందర్భంగా ప్రజా భద్రతను, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ శాఖ ప్రజలందరికీ ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నది. నూతన సంవత్సరం మొదటి రోజు ఏ కుటుంబం కూడా విషాదకర ఘటనతో ఆరంభం కాకుండా అన్ని జాగ్రతలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ యుక్త వయసు పిల్లలకు, మరీ ముఖ్యంగా మైనర్ పిల్లలకు, బైకులు, కార్లను ఇస్తే వారు ఆ వాహనాలను వేగంగా, నిర్లక్ష్యంగా లేక మద్యం, మత్తులో నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కావున ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి, సాధ్యమైనంత వరకు పిల్లలను కట్టడి చేసుకొవాలి. న్యూ ఇయర్ సందర్భంగా "డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసేందుకు, అతివేగం/ప్రమాదకరంగా వాహనాలు నడిపేవారు, త్రిబుల్ రైడింగ్ నడిపే వారి కొరకు ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతున్నది. అన్ని కూడళ్లలో బారికేడ్లు ఏర్పాటు న్యూసెన్స్ చేసే వారిపై చర్యలు తీసుకోబడును. 31వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ఎవరైనా రోడ్లపై అనవసరంగా సంచరిస్తూ పౌరులను అసౌకర్యం కలిగే విధంగా తిరిగే వారిపై న్యూసెన్స్ కేసు బుక్ చేసి వారిపై కఠిన చర్యలు



తీసుకోబడతాయి. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి తమ వేడుకలను అర్ధరాత్రి ఒంటిగంట లోపు పూర్తిచేసుకుని తమ తమ ఇళ్లకు వెళ్లాలని కోరుచున్నాము. అంతేకాకుండా నూతన సంవత్సర వేడుకల పేరుతో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై న్యూసెన్స్ చేసినా, లేక ఈవ్ టీజింగ్ లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిని అరెస్టు చేసి జైలుకు పంపడం జరుగుతుంది. నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాము.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి






**మహా,దుమ్ముగూడెం:** ట్రాక్టర్ బైకు ఢీకొని రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ సంఘటన సంబంధిం చిన స్థానికులు ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజుపేట- చిన్న ఆర్లగూడెం గ్రామాల మధ్య సోమవారం రాత్రి ట్రాక్టరు - మోటార్ సైకిల్ ఢీకొని రాజుపేట గ్రామానికి చెందిన యువకుడు తుర్స నరసింహారావు (20) అక్కడికక్కడే మృతి చెందాడు.ఎర్రబోరు గ్రామం నుంచి మహదేవపురం వస్తున్న ట్రాక్టర్ లక్ష్మీ నగరం నుండి బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువ కులు రాజుపేట గ్రామ చివర్లో ప్రమాదం జరిగింది. ఈ ప్రమా దంలో నరసింహా రావు మృతి చెందగా మోటార్ సైకిల్ వెనకాల కూర్చున్నటువంటి జంపన్నకు తీవ్ర గాయాలయ్యాయి వెంటనే స్థానికులు ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరలించి ప్రధమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కనుల పండుగా సీతారామచంద్రస్వామి ద్వార దర్శనం

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ గ్రామంలో కొలువైయున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ముక్కోటి సందర్భంగా మంగళవారం ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున భక్తులు ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు విస్సవజ్జుల సత్యవ్రత అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దుడ్డుకూరి శేఖరయ్య సంకా లక్ష్మణ్ మూర్తి, కాకర్ల ప్రతాప్, గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







## 40 రోజులు హనుమాన్ చాలీసా మండల పారాయణం చేసిన కాలనీ మహిళలు

**భద్రాచలం మహా:** భద్రాచలంలోని కూనవరం రోడ్డులో గల శాంతినగర్ కాలనీలోని సాక్షి గణపతి వీధి మహిళలు 40 రోజులపాటు హనుమాన్ చాలీసా పారాయణం చేసి ఈరోజుతో పూర్తి చేశారు. వీధిలోని మహిళలంతా సాక్షి గణపతి ఆలయం వద్ద ప్రతిరోజు 11సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి, అందరూ కలిసి రకరకాల ప్రసాదాలు తయారుచేసి స్వామివారికి నివేదన చేశారు. సాక్షి గణపతి వీధి మహిళలు ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశి కి ముందు 40 రోజులు హనుమాన్ చాలీసా మండల పారాయణం చేసి ముక్కోటి ఏకాదశి రోజుతో పూర్తి చేస్తారు. ఈ ఏడాది కూడా ప్రతిరోజు 11సార్లు పారాయణం చేసి 40 రోజులు పూర్తి చేశారు. చివరి రోజైన నేడు మహిళలంతా కలిసి 11సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి వివిధ రకాల నైవేద్యాలు తయారు చేసుకొచ్చి స్వామివారికి నివేదన చేశారు.

## నూతనసంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఎస్సై వీరేందర్

**చింతకాని, మహా:** చింతకాని మండల పరిధిలోన్యూ ఇయ ర్ వేడుకల వేళ.. హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవు అని సబ్ ఇన్స్పెక్టర్ఆఫ్ పోలీస్ చింతకాని వీరేందర్ అన్నారు. న్యూ ఇయర్వేడుకలు



సందర్భంగా మండల ప్రజలకు సూచనలు తెలిపినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చింతకానిమండల ప్రజలకు సూచించారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకో వాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకలను కుటుంబ సమేతంగా, ఇళ్లలో సంతోషంగా నిర్వహించు కోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్, రాష్, రాంగ్ రూట్ డ్రైవింగ్, దాడులు, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



# కటౌట్లు చూసి టికెట్లు ఇవ్వం

- గెలిచే 'గుర్రాల'కే బి-ఫామ్ : మంత్రి పొంగులేటి
- రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ నేతలతో సన్నాహక సమావేశం
- 32 వార్డుల్లోనూ కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కదలాలి
- అభివృద్ధి మన బ్రాండ్.. ప్రచారమే మన ఆయుధం
- వార్డుల వారీగా సమస్యల గుర్తింపు.. నిధుల మంజూరుకు మంత్రి హామీ

**ఖమ్మం:** రాబోయే మున్సిపల్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై మంత్రి కీలక ప్రకటన చేశారు. "కటౌట్లు పెట్టినంత మాత్రాన టికెట్లు రావు. ఎవరు ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడుతారో, ఎవరికి క్షేత్రస్థాయిలో ప్రజల ఆశీస్సులు ఉంటాయో వారికే బి-ఫాం అందుతుంది. గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. నా సొంత రక్తసంబంధీకులైనా సరే.. ప్రజల మద్దతు ఉంటేనే టికెట్ వస్తుంది" అని స్పష్టం చేశారు. ఏదులాపురంలోని 32 వార్డుల్లోనూ విజయం సాధించడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

### అభివృద్ధిని ఇంటింటికీ చేరవేయండి

ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని మంత్రి సూచించారు. "ఏదులాపురం పరిధిలో ఒక్క ఉపాధి హామీ పథకంతోనే రూ. 100 కోట్ల నిధులు తెచ్చాం. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రతి ఇంటికీ మేలు చేశాయి. ఈ అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా, వ్యక్తిగత ప్రచారం ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. చేసిన పనిని చెప్పుకోవడంలో మనం వెనకబడకూడదు" అని పేర్కొన్నారు.

### వార్డుల వారిగా ప్రణాళిక

ప్రతి వార్డులో పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలను (రోడ్ గ్యాప్‌లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు) గుర్తించి వెంటనే అధికారులకు జాబితా ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే ఆ పనులన్నీ పూర్తి చేసేలా నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. "ఇళ్ల స్థలాల విషయంలో పేదలకు అన్యాయం జరగకుండా నాయకులు పర్యవేక్షించాలి. ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, నాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి, చావా శివరామకృష్ణ, బేబీ స్వర్ణకుమారి, దొబ్బల సౌజన్య, హరినాథ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్టియన్ సోదరుల ప్రేమ విందు





**తల్లాడ, మహా:** తల్లాడ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం సర్వమతాలను సమదృష్టితో చూడాలన్న సంకల్పంతో క్రిస్టమస్ సందర్భంగా క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు స్థానిక సంఘ పెద్దలతో ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నూతనంగా నిర్మించబడుతున్న అంబేద్కర్ భవన్ లో మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు,వివిధ గ్రామాల క్రిస్టియన్ సోదరీ,సోదరీమణులు పాల్గొన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసుక్రీస్తు చూపిన ప్రేమను అనుసరించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ ( ర్ ఐ) క్రిస్టియన్ ప్రముఖులతో కలిసి కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేసి అనంతరం ప్రభుత్వం చేత అందించబడుతున్న క్రిస్టమస్ ప్రేమ విందును ప్రతి ఒక్కరు స్వీకరించారు. అనంతరం పలువురుకు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆర్గనైజేషన్ (ఎన్. సీ. సీ.టి సి, ఏఐసీసీ) క్రిస్టియన్ నాయకులు మేకల ప్రసాదరావు, సంఘసాని శ్రీనివాస్,కె. కెనడి రాజు,ఐ. శ్రీనివాసరావు,కె.వి ఇశ్రాయేలు,టి.సాల్మన్ రాజ్,జి.బాబురావు, ఎం.ఇజ్రాయిల్. మండల కాంగ్రెస్ నాయకులు దగ్గుల రఘుపతి రెడ్డి,తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు జి.వి.ఆర్,మాజీ జెడ్పిటిసి మూకర ప్రసాద్, గొడుగునూరి లచ్చిరెడ్డి,ఆర్.ఐ,టిడిపి నాయకులు ధూపాటి భద్రరాజు,సరికొండ శ్రీనివాసరాజు, క్రిస్టియన్ సోదరీ సోదరీమణులు విశ్వాసులు తదితరులు అధికంగా పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: పోలీస్ కమిషనర్



**(ఖమ్మం),మహా:** నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హెచ్చరించారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుతూ... డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని పోలీస్ కమిషనర్ అన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రెస్టారెంట్లు, షాపుల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అసభ్యకర డాన్స్ కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు. డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లిఅర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు.